అరుంధతీ రాయ్‌పై ఉపా చట్టం

ప్రాసిక్యూషన్‌కు అనుమతిచ్చిన ఢిల్లీ ఎల్జీ

న్యూఢిల్లీ: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌తో పాటు, కశ్మీర్‌కు చెందిన మాజీ ప్రొఫెసర్‌లను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) కింద ప్రాసిక్యూట్ చేయడానికి ఢిల్లీ లెఫ్ట్‌నెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇచ్చారు. 2010లో దేశ రాజధానిలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారన్న ఆరోపణలపై ఆరుంధతీ రాయ్‌ను, మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను ఉపా కింద విచారణ జరిపించడానికి గవర్నర్ అనుమతించినట్టు రాజ్ నివాస్ అధికారులు శుక్రవారం తెలిపారు. కాగా, న్యూఢిల్లీ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల ప్రకారం అరుంధతీ రాయ్‌తో పాటు కశ్మీర్ ప్రొఫెసర్ షేక్ షౌకత్‌లపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దీనిపై రాయ్, షౌకత్ ఇంకా స్పందించ లేదు. భారత్ నుంచి కశ్మీర్‌ను వేరు చేసే అంశాలపై 'ఢిల్లీలో ఆజాది-ద ఓన్లీ వే' పేరిట 2010 అక్టోబర్ 21న జరిగిన సమావేశంలో చర్చలు జరిగాయి. అందులో పార్లమెంట్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడైన సార్ గిలానీతో పాటు అరుంధతీ రాయ్ తదితరులు దేశ సమగ్రతను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్టు ప్రధాన ఆరోపణ.

నాటోలో చేరకుంటే కాల్పుల విరమణ

- **ఉక్రెయిన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రతిపాదన**
- **ఇది అసంబద్ధం, మోసపూరితం: ఉక్రెయిన్**

మాస్కో: ఇటలీలో జీ-7 సదస్సు జరుగుతున్న వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌కు కీలక ప్రతిపాదన చేశారు. రష్యా భూభాగాలుగా తాము ప్రకటించుకొన్న నాలుగు ప్రాంతాల నుంచి సైనిక దళాలను ఉపసంహరించుకొని, నాటోలో చేరాలన్న ఆలోచనను ఉక్రెయిన్ విరమించుకొంటే కాల్పుల విరమణను వెంటనే అమలు చేస్తామని చెప్పారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న సంఘర్షణకు ముగింపు పలకడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మాస్కోలోని విదేశాంగ కార్యాలయంలో ప్రసంగిస్తూ పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్ అణ్వస్త్ర రహిత స్థితి, తన మిలిటరీపై నియంత్రణ, రష్యన్ మాట్లాడే ప్రజల హక్కులను పరిరక్షించడం వంటి హామీలను అంతర్జాతీయ ప్రాథమిక ఒప్పందాలకు అనుగుణంగా ఉక్రెయిన్ తమకు హామీ ఇవ్వాలని పుతిన్ కోరారు. పుతిన్ ప్రతిపాదన పూర్తిగా అసంబద్ధమైనదని, మోసపూరితమైనదని ఉక్రెయిన్ విదేశాంగ శాఖ విమర్శించింది. అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు, శాంతిస్థాపన లక్ష్యంగా జరుగుతున్న దౌత్య ప్రయత్నాలను దెబ్బతీసేందుకు చేస్తున్న ప్రయత్నమని ఆరోపించింది. ఉక్రెయిన్‌కు చెందిన దొనెట్స్క్, లుహాన్స్క్ ఖేర్సన్, జపోరిజియాలపై రష్యాకు పూర్తి నియంత్రణ లేనప్పటికీ అవి తమ దేశంలో 2022లో విలీనమైనట్టు రష్యా ప్రకటించింది.

టెక్నాలజీలో గుత్తాధిపత్యానికి స్వస్తి పలకాలి

జీ7 దేశాల సదస్సులో ప్రధాని మోదీ

బారి(ఇటలీ): టెక్నాలజీలో గుత్తాధిపత్యానికి స్వస్తి పలకాలని భారత ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. సమ్మిళిత సమాజానికి పునాది వేసేందుకు సాంకేతికతను సృజనాత్మకంగా ఉపయోగించుకోవాలని అన్నారు. ఇటలీలోని అపులియా రీజియన్‌లో జరుగుతున్న జీ7 దేశాల సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కృత్రిమ మేధ(ఏఐ)పై ప్రత్యేకంగా మాట్లాడారు. మనం సాంకేతికతను సృజనాత్మకంగా వినియోగించుకోవాలే తప్ప విధ్వంసకరంగా కాదని అభిప్రాయపడ్డారు. మానవ కేంద్రీకృత విధానం ద్వారా మెరుగైన భవిష్యత్తుకు భారత్ ప్రయత్నిస్తున్నదని మోదీ పేర్కొన్నారు. భారత్ ఏఐ మిషన్ ప్రాథమిక మంత్రం 'అందరికీ ఏఐ' అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరత, ఉద్రిక్తతల ప్రభావాన్ని దక్షిణ దేశాలు అధికంగా ఎదుర్కొంటున్నాయన్నారు. జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, పోప్ ఫ్రాన్సిస్‌లతో సమావేశమయ్యారు.

సామాన్యుడిపై ధరాఘాతం

మొదటిపేజీ తరువాయి...

సహా ఆకుకూరల ధరలు కూడా భారీగా పెరిగాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా సరిపడా ఉల్లి మార్కెట్‌కు రాకపోవడమే ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గతంలో హైదరాబాద్‌కు రోజూ 8 వేల క్వింటాళ్ల ఉల్లిగడ్డ వస్తే ప్రస్తుతం 5 వేల క్వింటాళ్ల వరకే వస్తున్నది. ధరలు తగ్గించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలను అమలు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. డిమాండ్‌ను అంచనా వేసి ఆ మేరకు నిల్వలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గత నెల బావుల, బోర్ల కింద కూరగాయాల పంటలు వేశారని, ఆ పంట దిగుబడి మొదలైతే, వచ్చే రెండు నెలల్లో ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు.

సగానికి తగ్గిన ఉత్పత్తి

తెలంగాణ జనాభాకు ప్రతి ఏడాది 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరమవుతాయని ఒక అంచనా. అయితే ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలో 1.30 కోట్లకు పైగా ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగవుతున్నాయి. అందులో కూరగాయల పంటలు 3.11 లక్షల ఎకరాలకే పరిమితమయ్యాయి. ఈ కారణంగా జనాభా అవసరాలను సుమారు 19 లక్షల టన్నుల దిగుబడుల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తున్నది.

హైదరాబాద్‌లో ధరలు (శుక్రవారం కిలో రూ.ల్లో)

కూరగాయ	రైతు బజార్	బహిరంగ మార్కెట్
టమాటా	50	65
ఉల్లి	40	50
వంకాయ	40	60
బెండకాయ	50	80
పచ్చిమిర్చి	70	120
బీరకాయ	65	80
దొండ	40	60
గోరు	50	60
చిక్కుడు		
చిక్కుడు	60	100
బీన్స్	110	120
క్యారెట్	80	100
క్యాబేజీ	60	70
కాలిఫ్లవర్	60	70
క్యాప్సికం	80	100

15 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్ర మోదీ అసమర్థ విధానాలు, అనాలోచిత నిర్ణయాలతో సామాన్యుడిపై ధరాఘాతం పెను ప్రభావం చూపిస్తున్నది. వంటగ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ పెంపుతో ప్రజలు ఒకవైపు అల్లాడిపోతుంటే.. నిత్యావసరాల ధరలు వారిపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. దీన్ని రుజువు చేస్తూ.. మే నెలలో టోకు ద్రవ్యోల్బణం 2.61 శాతానికి పెరిగింది. గడిచిన 15 నెలల వ్యవధిలో ఇదే గరిష్ఠం. ఈ మేరకు కేంద్రప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తున్నది.

రాకెట్ వేగంతో టీవోపీ ధరలు

అరకొర సంపాదనతో బతుకు బండి లాగిస్తున్న సామాన్యులకు టీవోపీ (టమాట-ఆనియన్ (ఉల్లిగడ్డ)-పొటాటో (ఆలుగడ్డ)) ధరలు ఆకాశాన్నంటడం నిద్రలేకుండా చేస్తున్నది. వంటకు ప్రధానమైన ఈ మూడు కూరగాయల ధరలు అమాంతం పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ అదుపుతప్పుతున్నది. ఈ నెలలోనే ఉల్లిగడ్డల ధరలు 21 శాతం, టమాటా ధరలు 36 శాతం, ఆలుగడ్డల ధరలు 20 శాతం, వంట నూనెల ధరలు 15 శాతం పెరిగినట్టు క్వాంట్‌ఈకో రీసెర్చ్ సంస్థ తెలిపింది. 'వడగాలులు, అకాల వర్షాల నేపథ్యంలో ఉల్లి, టమాట దిగుబడిపై ప్రభావం పడింది. దీంతో మార్కెట్లోకి వచ్చే ఉల్లి, టమాట దిగుబడి భారీగా తగ్గిపోయింది. వచ్చేది పండుగల సీజన్. దీన్ని దృష్టిలో పెట్టుకొన్న రైతులు.. తమ పంటను విపణిలోకి తీసుకురావడాన్ని ఆలస్యం చేస్తున్నారు. భవిష్యత్తులో ఎక్కువ ధర వస్తుందనే వాళ్లు ఇలా చేస్తున్నారు. వెరసి డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో టమాట, ఉల్లిగడ్డలు, ఆలుగడ్డల ధరలు భారీగా పెరుగుతున్నాయి' అని క్వాంట్‌ఈకో రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. టీవోపీ ధరలు ప్రతీనెలా 5.2 శాతం మేర పెరుగుతున్నట్టు హెడీఎఫ్‌సీ బ్యాంక్ ఇటీవల ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇదే సమయంలో ప్రతీనెలా పప్పు దినుసులు 1.7 శాతం మేర పెరుగుతున్నట్టు వివరించింది. నిత్యావసరాల ధరలను కట్టడి చేయడంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఆ భారం తమపై పడుతున్నదని మోదీ సర్కారుపై సామాన్యులు మండిపడుతున్నారు.

మే వరకు అదుపులోనే ధరలు..

ఈసారి వేసవిలో స్థానికంగా కూరగాయల ఉత్పత్తి 20 శాతం వరకు తగ్గింది. డిమాండ్‌ను బట్టి వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దయెత్తున దిగుమతి చేసుకున్నారు. అందుకే మే వరకు ధరలు దాదాపు అదుపులోనే ఉన్నాయి. ఈ నెల మొదటి వారంలో వర్షాలు మొదలయ్యాక సమస్యలు ప్రారంభమయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న సమయంలో వర్షాలు పడడం వల్ల అవి తడిసిపోవడం, కుళ్లిపోవడం వంటి పరిణామాల దృష్ట్యా కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. హైదరాబాద్ నగర జనాభాకు ప్రతి రోజు దాదాపు 3,300 టన్నుల కూరగాయల అవసరం ఉంటుంది. కానీ వారం రోజులుగా అన్ని హోల్‌సేల్ మార్కెట్లకు 2,800 టన్నుల సరకు మాత్రమే వస్తున్నది. మరోవైపు ధరలు పెరిగిన నేపథ్యంలో కొనుగోళ్లు పెద్దగా జరుగడం లేదని, దీంతో ఉన్న సరుకు పాడైపోయి, పెట్టుబడి కూడా రావడం లేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూలై 22న కేంద్ర బడ్జెట్?

- **వచ్చే నెల 3న ఆర్థిక సర్వే**
- **ప్రభుత్వ వర్గాల వెల్లడి**

న్యూఢిల్లీ, జూన్ 14: లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఎన్డీయే కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో జూలై 22న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 3న ఆర్థిక సర్వేను పార్లమెంట్ ముందుకు తీసుకొస్తారని తెలుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరి 1న మోదీ సర్కార్ తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాజాగా మరోసారి కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్ ఈనెల 12న సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. 2024-25 బడ్జెట్‌కు సంబంధించిన కసరత్తు ప్రారంభించాలని ఆమె అధికారులను ఆదేశించినట్టు సమాచారం. మరోవైపు సీతారామన్ నేతృత్వంలో ఈనెల 22న ఢిల్లీలో 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని జీఎస్టీ కౌన్సిల్ గురువారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది.

కొవిడ్ అడ్వాన్స్ నిలిపివేత

ఈపీఎఫ్‌వో నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 14: కొవిడ్-19 సమయంలో ప్రవేశపెట్టిన 'అడ్వాన్స్' సదుపాయాన్ని తక్షణం నిలుపుదల చేయాలని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) నిర్ణయించింది. కరోనా ప్రభావం మహమ్మారిగా లేనందున ఈ నిర్ణయం తీసుకొన్నట్టు పేర్కొన్నది. కొవిడ్ సమయంలో ఈ అడ్వాన్స్ స్కీమ్‌ను ప్రవేశపెట్టారు. దీని కింద ఈపీఎఫ్‌వో చందాదారులకు తమ ఖాతాల నుంచి తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని కొంత మొత్తాన్ని అడ్వాన్స్ రూపంలో ఇచ్చారు. కొవిడ్ సెకండ్ వేవ్ వచ్చిన 2021లో మరో అడ్వాన్స్ స్కీమ్‌ను ప్రవేశపెట్టారు. మరోవైపు ప్రతి సభ్యుడికి యూఏఎన్ ఆధారిత సింగిల్ ఖాతా వ్యవస్థను ఈపీఎఫ్‌వో ప్రవేశపెట్టనున్నదని, క్లెయిమ్‌ల వేగవంతమైన పరిష్కారం కోసం ప్రక్రియను ఆటోమేట్ చేసేలా సంబంధిత అప్లికేషన్‌ను మెరుగుపచనున్నదని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పేర్కొన్నది.

త్వరలో క్యాబినెట్‌కు జమిలి నివేదిక

న్యూఢిల్లీ: 'ఒక దేశం - ఒకే ఎన్నికలు'పై కేంద్ర ప్రభుత్వం చురుగ్గా కదులుతున్నది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ మార్చి 15న నివేదికను సమర్పించింది. ఈ నివేదికను త్వరలో కేంద్ర క్యాబినెట్‌కు అందజేయాలని న్యాయ శాఖ ప్రయత్నిస్తున్నది. ప్రధాని మోదీ నూతన ప్రభుత్వానికి నిర్దేశించిన తొలి 100 రోజుల ఎజెండాలో ఇది కూడా భాగమే. కోవింద్ కమిటీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించిన నివేదికలో అనేక సిఫారసులు చేసింది. ముందుగా లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, అవి పూర్తయిన 100 రోజుల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని తెలిపింది. మరోవైపు జమిలి ఎన్నికలపై లా కమిషన్ కూడా తన నివేదికను త్వరలోనే ఇవ్వబోతున్నట్లు తెలుస్తున్నది.

అగ్ని ప్రమాదమంటూ వదంతి.. రైల్లో నుంచి దూకేసిన ప్రయాణికులు

ముగ్గురి దుర్మరణం..
జార్ఖండ్‌లో ఘటన

ధన్‌బాద్, జూన్ 14: రైలు బోగీలో నిప్పంటుకుందన్న వదంతి ముగ్గురు ప్రయాణికుల ప్రాణాలను బలిగొంది. అగ్నిప్రమాద భయంతో ససారం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నుంచి బయటకు దూకిన ప్రయాణికుల్లో ముగ్గురు అదే సమయంలో పక్క పట్టాలపై వస్తున్న గూడ్స్ రైలు కింద పడి మరణించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 8 గంటలకు జార్ఖండ్‌లో చోటుచేసుకుంది. రాంచీ-ససారం ఎక్స్‌ప్రెస్ ధన్‌బాద్ డివిజన్‌లోని కుమందిహ్ రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్న సమయంలో రైలులో అగ్నిప్రమాదం చోటుచేసుకుందని కొందరు వదంతి రేపారు. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. కొందరు ప్రయాణికులు ప్రాణభయంతో నడుస్తున్న రైలు నుంచి కిందకు దూకేశారు. అదే సమయంలో పక్కనున్న పట్టాలపై గూడ్స్ రైలు వస్తుండటంతో దాని కింద నలిగి ముగ్గురు మరణించారు. రైలులో అగ్నిప్రమాదం జరిగినట్టు గుర్తు తెలియన వ్యక్తి నుంచి కుమందిహ్ స్టేషన్‌కు ఫోన్ వచ్చిందని ధన్‌బాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ తెలిపారు. దీంతో రైలును ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి ప్రమాదం జరగలేదని, కేవలం వదంతి మాత్రమేని తెలిసిందన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం మావోయిస్టుల ప్రభావం ఉన్న ఏరియా కావడంతో, దీని వెనుక ఉగ్రవాద కోణం ఏమన్నా ఉందా అన్న విషయాన్ని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీట్ ఉత్తీర్ణతకు విద్యార్థులతో బేరం!

గుజరాత్‌లో స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్ సహా ఐదుగురు అరెస్టు

గోధ్రా: నీట్ యూజీలో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు సహకరించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణల కేసులో ఇప్పటి వరకు గుజరాత్‌లోని పంచమహ జిల్లా గోద్రా పట్టణంలోని ఓ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్, టీచర్ సహ ఐదుగురిని అరెస్టు చేసినట్టు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. 27 మంది మంది విద్యార్థులతో వీరు రూ.10 లక్షల చొప్పున బేరం మాట్లాడుకొన్నారని తెలిపారు. గత నెల 5న నిర్వహించిన నీట్ పరీక్షకు ఈ స్కూల్ ఒక సెంటర్‌గా ఉన్నది. అయితే పరీక్ష క్రమంలో పలువురు అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు వచ్చిన సమాచారంతో ఈ రాకెట్‌కు ఛేదించినట్టు పోలీసులు గత నెల 9న నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో అరెస్టు అయిన వారిలో టీచర్ తుషార్ భట్, స్కూల్ ప్రిన్సిపాల్ పర్షోత్తం శర్మ, వడోదరకు చెందిన ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ పరుశురాం రాయ్, అతని సహచరుడు విభోర్ ఆనంద్, మధ్యవర్తి ఆరిఫ్ వోహ్రా ఉన్నారు.

కెనడా వర్క్ పర్మిట్ రూల్స్ కఠినతరం!

న్యూఢిల్లీ: పోస్టు గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్(పీజీడబ్ల్యూపీ) వీసా ప్రోగ్రామ్‌లో కీలక మార్పులు చేసేందుకు కెనడా ప్రభుత్వం సిద్ధమైంది. ఉద్యోగులు, కార్మికుల కొరత ఉన్న రంగాలకు సంబంధించిన కోర్సుల గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పీజీడబ్ల్యూపీ ప్రోగ్రామ్ లబ్ధి పరిమితం చేసేలా ప్రణాళికలు రచిస్తున్నది. దీని ద్వారా ఆయా రంగాల్లో కార్మికుల కొరత సమస్యను పరిష్కరించొచ్చని సర్కార్ భావిస్తున్నట్టు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. కెనడాలోని ప్రైవేటు కాలేజీల్లో ఎన్‌రోల్ అయివున్న విద్యార్థులు ఇకపై ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి పీజీడబ్ల్యూపీ లబ్ధికి ఆటోమేటిక్‌గా అర్హత సాధించే అవకాశం ఉండబోదు. ఈ విధమైన మార్పులతో భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడునున్నది. కెనడాలో చదువుకొంటున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో 40 శాతం వరకు భారతీయులే ఉంటారు.

సీబీఐ దర్యాప్తుపై మీ స్పందనేంటి?

- **2 వారాల్లోగా తెలియజేయండి**
- **కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం**
- **నీట్-యూజీలో అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరపాలని పిటిషన్**
- **ప్రశ్నా పత్రాలు లీక్ కాకపోతే అరెస్టులు ఎందుకు: ఖర్గే**
- **ఎన్‌టీఏలో లోపాలు ఉంటే సరిదిద్దుతాం: ధర్మేంద్ర ప్రధాన్**

న్యూఢిల్లీ, జూన్ 14: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, అక్రమాలపై హితెన్ సింగ్ కశ్యప్‌తో పాటు మరికొందరు సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ జరిపింది. ఇది 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయమని, సీబీఐ విచారణ జరిపించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టును కోరారు. అయితే, ఈ విషయాన్ని తాము అర్థం చేసుకున్నామని, అన్ని అంశాలు తమ దృష్టిలో ఉన్నాయని కోర్టు పేర్కొన్నది. ఈ సందర్భంగా నీట్ పరీక్ష శిక్షణకు కేంద్రంగా ఉన్న రాజస్థాన్‌లోని కోటాలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలను న్యాయవాది ప్రస్తావించగా కోర్టు అడ్డుకుంది. అనవసరమైన భావోద్వేగ వాదనలు చేయవద్దని, నీట్ ఫలితాల వల్ల కోటాలో ఆత్మహత్యలు జరగడం లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్ పేర్కొన్నారు. సీబీఐ విచారణ జరిపించడంపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్రం, ఎన్‌టీఏతో పాటు సీబీఐ, బీహార్ ప్రభుత్వాన్ని ఆదేశించిన కోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. ఈ కేసును జూలై 8న సాధారణ ధర్మాసనం విచారిస్తుందని తెలిపింది.

అన్ని పిటిషన్లు సుప్రీంకోర్టుకు బదిలీ చేయండి: ఎన్‌టీఏ

నీట్-యూజీ పరీక్షపై వేర్వేరు హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాల్సిందిగా ఎన్‌టీఏ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం వెకేషన్ బెంచ్ విచారించింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాల్సిందిగా హైకోర్టులను ఆశ్రయించిన పిటిషన్‌దారులను ఆదేశించింది. మొత్తం పిటిషన్లు అన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఎన్‌టీఏ తరపున న్యాయవాది కోర్టును కోరారు.

మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారు?: ఖర్గే

నీట్-యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కాకపోతే బీహార్‌లో 13 మందిని పేపర్ లీక్ చేశారని ఎందుకు అరెస్టు చేశారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రాన్ని ప్రశ్నించారు. పేపర్లు ఇచ్చిన ముఠాకు రూ.30 - రూ.50 లక్షలు అందిన వైనాన్ని పట్నా పోలీసులు బయటపెట్టలేదా అని అడిగారు. గుజరాత్‌లోని గోద్రాలోనూ నీట్-యూజీ చీటింగ్ రాకెట్ పట్టుబడలేదా? అని ప్రశ్నించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎన్‌టీఏ ద్వారా నీట్ కుంభకోణాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం మోదీ ప్రభుత్వం చేస్తున్నదని ఆరోపించారు.

అక్రమాలను ఉపేక్షించబోం: ప్రధాన్

పరీక్షల నిర్వహణలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్‌ను, అక్రమాలను తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని, ఎన్‌టీఏ జవాబుదారీతనానికి సంబంధించి ఏమైనా లోపాలు గుర్తిస్తే సరిదిద్దుతామని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ ఏడాది సిలబస్ తక్కువ కావడం, అభ్యర్థుల సంఖ్య పెరగడం వల్ల పోటీ పెరిగిందని, టాప్ ర్యాంకర్లు పెరిగారని ఆయన స్పష్టత ఇచ్చారు.

'నీట్' ఒక కుంభకోణం: స్టాలిన్

విద్యను మాత్రమే ఎవరూ దొంగలించలేరని, అయితే ఇప్పుడు నీట్ లాంటి పరీక్షల్లోనూ కుంభకోణాలు జరుగుతున్నాయని, దీనిని బలంగా వ్యతిరేకించాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. నీట్ అనేది ఒక కుంభకోణం అని తమిళనాడు మొదట చెప్పిందని, ఇప్పుడు దేశమంతా చెప్తున్నదని ఆయన అన్నారు.



ముస్లింలకు ఎంతో పవిత్రమైన హజ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. మక్కాలోని గ్రాండ్ మసీదులో గల కాబా చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేశారు. సుమారు 20 లక్షల మంది ఈ యాత్రకు విచ్చేస్తారని భావిస్తున్నారు. మక్కాలో ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్ ఉన్నందున భక్తులు గొడుగులు తెచ్చుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

'మీడియా స్వేచ్ఛను హరించే చట్టాలు ఉపసంహరించుకోవాలి'

న్యూఢిల్లీ, జూన్ 14: మీడియా స్వేచ్ఛను అణచివేసేలా ఉన్న ఐటీ సవరణ నిబంధనలు-2023, డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టం-2023 సహా పలు ఇతర చట్టాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. సమాచారం తెలుసుకొనే ప్రజల హక్కును నిర్ధారించాలని స్పష్టం చేశాయి. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియాలతో కూడిన సంస్థను తీసుకురావాలని సూచించాయి. వర్కింగ్ జర్నలిస్టు అండ్ అదర్ న్యూస్‌పేపర్ ఎంప్లాయీస్(కండిషన్ ఆఫ్ సర్వీస్) చట్టం-1955, వర్కింగ్ జర్నలిస్ట్స్(ఫిక్సేషన్ ఆఫ్ రేట్స్ ఆఫ్ వేజెస్) చట్టం-1958లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి. ఆ చట్టాల్లో బ్రాడ్‌కాస్ట్, డిజిటల్ మీడియా జర్నలిస్టులను కూడా చేర్చాలని కోరాయి.

కేరళకు కువైట్ అగ్నిప్రమాద బాధితుల మృతదేహాలు

కొచ్చి, జూన్ 14: ఈ నెల 12న కువైట్ అగ్ని ప్రమాదంలో మరణించిన 31 మంది భారతీయులు, 23 మంది మలేషియన్ల మృతదేహాలు శుక్రవారం కొచ్చికి చేరుకున్నాయి. వాటిలో 23 భౌతికకాయాలు కేరళీయులవి కాగా.. ఏడు తమిళులవి, ఒక కన్నడిగుడిది. భారత వైమానిక దళ విమానంలో వాటిని తీసుకొచ్చారు. విదేశాంగ సహాయమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ విమానంలో మృతదేహాల వెంట వచ్చారు. మరో 14 మృతదేహాలను అదే విమానంలో ఢిల్లీకి పంపించారు. కేరళ సీఎం విజయన్, కేంద్ర మంత్రి సురేశ్ గోపీతో సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు మృతులకు పుష్పాంజలి ఘటించారు.

కువైట్‌కు కేరళ మంత్రిని అనుమతించకపోవడంపై ఆగ్రహం

కువైట్‌లో మరణించిన, గాయపడిన భారతీయులకు అందించే సహాయ చర్యలను సమన్వయం చేయడానికి కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్‌కు కేంద్రం అనుమతి ఇవ్వకపోడంపై కేరళ సీఎం విజయన్, కాంగ్రెస్ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి.

చార్‌ధామ్ దర్శనాలపై ఆంక్షల తొలగింపు

న్యూఢిల్లీ: చార్‌ధామ్ దేవాలయాలను రోజువారీ సందర్శించే భక్తుల సంఖ్యపై పరిమితిని ఉత్తరాఖండ్ ప్రభుత్వం తొలగించింది. కొద్ది రోజుల నుంచి ఈ యాత్ర సజావుగా, సాధారణ స్థితిలో కొనసాగుతుండటంతో శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భక్తు లు రిషికేశ్, హరిద్వార్‌లలోని రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్దకు వెళ్లి నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి దేవాలయాలను సందర్శించవచ్చు. ఈ దేవాలయాలను సందర్శించాలనుకునే భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుండటంతో ఏప్రిల్‌లో రోజువారీ రిజిస్ట్రేషన్లపై పరిమితిని విధించిన సంగతి తెలిసిందే.

ఆర్మీ చేతికి 'నాగాస్త్ర-1'

దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి ఆత్మాహుతి డ్రోన్

న్యూఢిల్లీ, జూన్ 14: భారత సైన్యం అమ్ములపొదిలోకి మరో అత్యాధునిక ఆయుధం చేరింది. ఆయుధ, రక్షణ వ్యవస్థ స్వావలంబనలో భాగంగా దేశీయంగా తొలిసారిగా అభివృద్ధి చేసిన సూసైడ్(ఆత్మాహుతి) డ్రోన్ 'నాగాస్త్ర-1' ఆర్మీ చేతికి అందింది. 9 కిలోల బరువు ఉండే ఈ డ్రోన్‌ను మనిషి మోసుకెళ్లేలా రూపొందించారు. కామికేజ్ మోడ్‌లో(శత్రు స్థావరాలు, లక్ష్యాలపై డ్రోన్‌ను సొంతంగా కూల్చివేయడం) పనిచేయడం ద్వారా ఈ నాగాస్త్ర శత్రువుల ముప్పును సమర్థంగా నిలువరించగలుగుతుందని ఆర్మీ వర్గాలు చెబుతున్నాయి. నాగాస్త్ర-1ను మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్ కంపెనీ అభివృద్ధి చేసింది.

'నాగాస్త్ర-1' ప్రత్యేకతలు: బరువు- 9 కిలోలు, 1 కిలో పేలుడు పదార్థాలు మోసుకెళ్లే సామర్థ్యం • పరిధి- 15-30 కిలోమీటర్లు • 200 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో కనిపించదు • జీపీఎస్ వినియోగంతో కచ్చితమైన దాడులు • లక్ష్యంపై దాడి కచ్చితత్వం- 2 మీటర్లు • 24 గంటల నిఘా కెమెరాలు.

మోహన్ భాగవత్‌తో యోగి భేటీ?

నేడు గోరఖ్‌పూర్‌లో కలిసే అవకాశం

లక్నో: ఆరెస్సెస్ అగ్రనేత మోహన్ భాగవత్‌తో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ భేటీ అయ్యే అవకాశం ఉంది. శనివారం యోగి సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్‌లో వీరి భేటీ ఉండనున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఆరెస్సెస్ కార్యకర్తల సమావేశాల కోసం భాగవత్ గోరఖ్‌పూర్ పర్యటనకు వచ్చారు. మరోవైపు అభివృద్ధి పనులపై సమీక్ష కోసం యోగి కూడా గోరఖ్‌పూర్ వెళ్లనున్నారు. అసలైన సేవకుడికి అహంకారం ఉండదని, హుందాగా ప్రజాసేవ చేస్తాడని లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో మోహన్ భాగవత్, యోగి ఆదిత్యనాథ్ భేటీకి రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.